సాక్షి ఖమ్మం

బుధవారం । 17 । జనవరి । 2024



బిర్రులన్నీ కిటకిట!

తెలంగాణ - ఏపీ సరిహద్దులోని కోడిపందేల బిర్రులన్నీ కిటకిటలాడగా పందేలు తిలకించేందుకు జిల్లా నుంచి భారీగా వెళ్లారు. 8లో



న్యాయం జరిగేనా?

కొత్తప్రభుత్వంలోనైనా వేతనాల విషయంలో తమకు న్యాయం జరుగుతుందని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఆశిస్తున్నారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 18°

జిల్లాలో బుధవారం ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశముంది. మిగతా సమయం సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. నేలకొండపల్లి మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి, కూసుమంచి మండల కేంద్రం, తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు, పాతర్లపాడు, జింకలగూడెం, ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి, ఖమ్మంలోని రాపర్తినగర్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడమే కాక ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే, సాయంత్రం 4నుంచి 6 గంటల వరకు ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజలు, నాయకులకు మంత్రి అందుబాటులో ఉంటారని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

జిల్లా రవాణా శాఖాధికారిగా గౌస్‌పాషా



డీటీఓకు శుభాకాంక్షలు చెబుతున్న ఎంవీఐలు

ఖమ్మంక్రైం: జిల్లా రవాణాశాఖాధికారిగా గౌస్ పాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖలో డిప్యూటేషన్(ఆన్‌డ్యూటీ)పై పనిచేస్తున్న ఎంవీఐల పోస్టింగ్‌లను ప్రభుత్వం రద్దు చేసింది. ఈనేపథ్యాన కరీంనగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఎంవీఐ గౌస్‌పాషాను జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖాధికారిగా నియమించారు. గతంలో ఆయన ఖమ్మం, వైరాలో ఎంవీఐగా విధులు నిర్వర్తించగా ఇప్పుడు రవాణా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఇక్కడ రవాణా శాఖాధికారిగా ఉన్న తోట కిషన్‌రావు ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి చెక్ పోస్ట్‌లో కొనసాగనున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన దళితబంధు ప్రాజెక్టులో అర్హులకు లబ్ధి జరిగేలా కిషన్‌రావు కృషి చేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రవాణాశాఖాధికారి గౌస్‌పాషాను ఎంవీఐలు వరప్రసాద్, శంకర్‌నాయక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఓఈ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ఆధ్వర్యాన ఖమ్మం రీజియన్‌లో నిర్వహిస్తున్న సీఓఈ కళాశాలలో సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీఓ ప్రత్యూష సూచించారు. ఖమ్మంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాల, దానవాయిగూడెంలోని బాలికల గురుకుల కళాశాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని బాలుర గురుకుల కళాశాలలకు సీఓఈగా గుర్తింపు ఉందని తెలిపారు. ఈమేరకు వచ్చే విద్యాసంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు ఈనెల 20వ తేదీలోగా రూ.200 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, హెచ్‌సీ, కన్వర్టర్డ్ క్రిస్టియన్, ఓసీ కులాలకు చెందిన బాలబాలికలు అర్హులని, మొదటి దశ స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 4న, రెండో దశ పరీక్ష ఫిబ్రవరి 25వ తేదీ నిర్వహిస్తామని తెలిపారు.

20న 'నవోదయ' ప్రవేశపరీక్ష

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 20024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20న పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు హాజరయ్యే విద్యార్థులు తీసుకోవాలిన్న జాగ్రత్తలను విద్యాలయ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,140 మంది విద్యార్థులు హాజరుకానుండగా, ఆధార్‌కార్డు లేదా నివాస ధృవీకరణ పత్రంతో పాటు ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్‌పెన్ తీసుకురావాలని సూచించారు. క్యాలుక్యులేటర్, డిజిటల్ వాచ్‌తో పాటు ఏ ఇతర ఎల్రక్టానిక్ వస్తువులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు ఉదయం 10.30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 77021 57196, 98484 02281 నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా సూచించారు.

సమీకృత పాలన సక్సెస్!



వీ.వీ.పాలెంలోని నూతన కలెక్టరేట్ భవనం

కొత్త కలెక్టరేట్‌తో ఒకే చోట 31 శాఖలు

- సమస్యలపై వచ్చే ప్రజలకు తగ్గిన భారం
- అధికారుల సమీక్షలకు కలిసొస్తున్న సమయం
- కొత్త కలెక్టరేట్ ప్రారంభించి రేపటితో ఏడాది

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఒకేచోట పలు శాఖలతో కూడిన సమీకృత పాలన జిల్లాలో విజయవంతమైంది. నూతన కలెక్టరేట్ ద్వారా సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చే ప్రజలకు దూరాభారం తగ్గడమే కాక అధికారుల సమీక్షలకు సమయం కలిసొస్తోంది. గత ఏడాది జనవరి 18న జిల్లా కేంద్రానికి సమీపంలోని వి.వెంకటాయపాలెంలో నిర్మించిన నూతన కలెక్టరేట్(ఐడీఓసీ)లో ప్రజాపాలన ప్రారంభమైంది. ఒకే భవనంలోకి 31 శాఖలు రావడంతో అటు ప్రజలు, ఇటు అధికారులకు పనులు సులువవుతున్నాయి. కాగా, కొత్త కలెక్టరేట్ ప్రారంభించి గురువారంతో ఏడాది పూర్తికానుంది.

20.10 ఎకరాలు.. రూ.53.20 కోట్లు

రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం సమీపాన 20.10 ఎకరాల భూమిని సేకరించి రూ.53.20 కోట్లతో నూతన కలెక్టరేట్ నిర్మించారు. ఇందులో భూసేకరణకు రూ.21.76 కోట్లు వెచ్చించారు. మొత్తం 1,59,307 చదరపు అడుగుల్లో కలెక్టరేట్ నిర్మాణం జరగగా.. గ్రౌండ్ ఫ్లోర్ 53,940 చదరపు అడుగుల్లో, మొదటి అంతస్తు 50,874 చదరపు అడుగుల్లో, రెండో అంతస్తులో 54,493 చదరపు అడుగుల్లో నిర్మాణాలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓ చాంబర్లే కాక సమావేశ హాల్, ఎన్ఐసీ, వీడియో కాన్ఫరెన్స్, కలెక్టరేట్ ఉద్యోగుల విభాగాలు ఉన్నాయి. ఇక మొదటి అంతస్తులో స్టేట్ చాంబర్(మంత్రులు, అధికారులు వచ్చినప్పుడు ఉపయోగపడేలా), వీసీ హాల్, ఇతర శాఖలకు సంబంధించిన కార్యాలయాలు, రెండో అంతస్తులో వీసీ హాల్, ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు కొనసాగుతున్నాయి.

సోలార్ పార్కింగ్ భేష్

పార్కింగ్ షెడ్ లేక తొలి రోజుల్లో ఉద్యోగులు వాహనాలను పార్కింగ్ చేయడానికి ఇబ్బంది పడ్డారు. అయితే, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కలెక్టర్ గౌతమ్ సోలార్ పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేయించారు. పైన సోలార్ ప్యానళ్లతో షెడ్లు నిర్మించగా, కలెక్టరేట్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి కావడమే కాక ఉద్యోగుల వాహనాల పార్కింగ్ కష్టాలు తీరాయి. ఇక చిల్డ్రన్స్ ప్లే ఏరియా, అతిపెద్ద సమావేశ మందిరం, మినీ మీటింగ్ హాళ్లు, వీడియో కాన్ఫరెన్స్‌కు ప్రత్యేకంగా హాల్ ఈ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఉన్నాయి.

బస్టాప్, క్యాంటీన్ కూడా ఉంటే...

కలెక్టరేట్ ప్రారంభించాక కొన్నినెలలకు రెండో అంతస్తులో క్యాంటీన్ ఏర్పాటుచేశారు. అయితే, ఇది కొన్నాళ్లకే మూతపడింది. దీంతో ఉద్యోగులు, పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే, కలెక్టరేట్ వద్ద రెండు పక్కలా బస్టాప్‌లు నిర్మించాల్సి ఉంది. అవి లేకపోవడంతో రహదారులపై ఎండావానలో బస్సుల కోసం వేచి ఉంటున్నారు. కలెక్టరేట్ ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా క్యాంటీన్ ఏర్పాటు, బస్టాప్‌ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలనే వినతులు వస్తున్నాయి.

నలుగురు సీఎంల చేతుల మీదుగా..



కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు..

రాష్ట్రంలో ఏ కలెక్టరేట్‌కు దక్కని అరుదైన అవకాశం ఖమ్మం కలెక్టరేట్‌కు దక్కింది. నాటి సీఎం కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు పినరయి విజయన్, అరవింద్‌కేజ్రీవాల్, భగవంత్‌సింగ్‌మాన్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ కలెక్టరేట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ వీపీ.గౌతమ్ తన చాంబర్‌లోని సీట్లో కూర్చోవడంతో అదేరోజు పాలన ప్రారంభమైంది. అయితే, తొలి వర్షాలకే ఒకటి, రెండు ప్రాంతాల్లో గోడలు వెంట నీరుకారి చమ్మగిల్లగా.. ఆ వెంటనే మరమ్మతులు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

అభివృద్ధి పనుల్లో వేగం





ఆస్పత్రి భవన పనులపై సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ గౌతమ్ (ఇన్‌సెట్) సమీక్షలో మాట్లాడుతున్న భట్టి

- త్వరగా పూర్తయ్యేలా దృష్టి సారించండి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కలెక్టర్ సహా అధికారులతో సమీక్ష

మధిర: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మధిరలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్షించారు. టెండర్లు పూర్తయి పురోగతిలో ఉన్న పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించి, ట్యాంక్ బండ్‌పై రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకోవాలని, అంబారుపేట చెరువులో గణేష్ నిమజ్జనానికి బదులు ప్రత్యామ్నాయ చెరువును గుర్తించాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఓఆర్ఆర్‌కు ప్రతిపాదనలు

మధిర చుట్టూ ఉన్న రహదారులను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి ఆదేశించారు. విద్యార్థులు లేక మూతబడిన పాఠశాలల భవనాలను నియోజకవర్గానికి మంజూరై ఇతర ప్రదేశాల్లో నడుస్తున్న గురుకులాలకు కేటాయించాలన్నారు. అలాగే, కట్టలేరు, జాలిముడి ఆధునీకీకరణ పనులు, స్నానాల లక్ష్మీపురం ఆలయం, మధిర పెద్ద చెరువు, జమలాపురం, ఇంద్రాయ చెరువుల అభివృద్ధిపై సూచనలు చేశారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు చంద్రమౌళి, శ్యాంప్రసాద్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఎంహెచ్ఓ బి.మాలతి, ఆర్డీఓ జి.గణేష్, ఆరోగ్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై అసహనం

మధిరలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనుల్లో అధికారుల తీరుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ గౌతమ్‌తో కలిసి ఆయన వంద పడకల ఆస్పత్రి, మినీ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రూ.36కోట్లతో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం ప్లాన్ సక్రమంగా లేదని పేర్కొన్న ఆయన 'మీ ఇల్లు అయితే ఇలాగే కట్టుకుంటారా' అని వైద్య, ఆరోగ్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావుపై అసహనం వ్యక్తం చేశారు. బేస్‌మెంట్ ఎత్తుగా లేకపోవడంతో వర్షం వస్తే నీరు చేరుతుందన్నారు. కాగా, భవనం ముందు మురికిగుంతలు ఉండడంపై ప్రశ్నించారు. అనంతరం మినీ స్టేడియాన్ని పరిశీలించారు. అలాగే, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడిన భట్టి సమస్యలు ఆరా తీశారు.

అటవీ ఠాణాలేవి ?

- జాడలేని ఫారెస్టు పోలీస్‌స్టేషన్లు
- బెండాలపాడు ఘటనతో తెరపైకి అంశం
- ప్రభుత్వం మారడంతో అటకెక్కిన ప్రతిపాదనలు
- భద్రాద్రి జిల్లాలో మూడు స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అడవుల రక్షణలో భాగంగా గత ప్రభుత్వం తెరపైకి తెచ్చిన అటవీ పోలీస్ స్టేషన్ల అంశం మరుగున పడిపోయింది. అయితే ఇటీవల టేకులపల్లిలో ఫారెస్టు సిబ్బందిపై ఇసుక మాఫియా దాడికి యత్నించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోనే అత్యధిక అడవులు భద్రాద్రి జిల్లాలో ఉన్నాయి. ఓవైపు కలప, ఇసుక స్మగ్లర్ల నుంచి అటవీ సంపదకు నష్టం వాటిల్లుతుండగా, మరోవైపు ఏటా జూన్ నుంచి నవంబర్ వరకు పోడు సాగుదారులు, అటవీ శాఖ సిబ్బంది మధ్య ఉద్రిక్తత నెలకొంటోంది. మొక్కలు నాటేందుకు ట్రెంచ్ కొట్టడం, గుంతలు తీసేందుకు అటవీ అధికారులు ప్రయత్నించినప్పుడల్లా స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, పెనుగులాటు నిత్యకృత్యంగా మారాయి. పోలీసుల సాయం లేకుండా అటవీ సిబ్బంది ఆ భూముల్లోకి అడుగు పెట్టలేని ఘటనలు ఎదురవుతున్నాయి.

ఎఫ్ఆర్ఓ హత్య ఘటనతో..

గతేడాది నవంబర్ 20న చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామపంచాయతీ పరిధిలో పోడు భూముల విషయంలో తలెత్తిన వివాదంలో అటవీ శాఖ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావుపై వలస ఆదివాసీలు దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ఫారెస్టు పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలంటూ 2022 నవంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వానికి అటవీ శాఖ ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. తొలిదశలో 30 స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించగా.. అప్పటి నుంచి ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది.

ఎప్పుడొచ్చేనో...?

రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఈ ఫారెస్ట్ పోలీస్‌స్టేషన్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. మళ్లీ సీజన్‌లో వస్తే ఇబ్బందులు తలెత్తనుండగా జాప్యం చేయకుండా ఫారెస్టు పోలీస్ స్టేషన్ల అంశంలో నిర్ణయం తీసుకోవాలనే డిమాండ్ ఆ శాఖ నుంచి వస్తోంది.

మూడింటికి గ్రీన్ సిగ్నల్..

రైల్వే ఆస్తుల రక్షణకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఉన్నా, రైల్వే ప్రాంగణాల వద్ద జరిగే నేరాల అదుపు, విచారణకు ప్రత్యేకంగా ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్లు(జీఆర్‌పీ) ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ పోలీసులే ఇక్కడ శాంతి భద్రతల విధులు నిర్వహిస్తారు. అదేవిధంగా అడవుల రక్షణకు ఫారెస్టు సిబ్బంది ఉన్నా.. ఇక్కడ జరిగే నేరాలు, బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాల కోసం ప్రత్యేకంగా ఫారెస్టు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయొచ్చని తెలుస్తోంది. రాష్ట్రంలో తొలిదశగా 20 పోలీస్ స్టేషన్లు ఏర్పాటుచేయాలనేది నిర్ణయం కాగా.. జిల్లాలో ఏడు స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ జాబితాలో ఆళ్లపల్లి, చర్ల, ములకలపల్లికి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలిసింది.

అప్పట్లో ఆయుధాలు కూడా..

నలభై ఏళ్ల కిందట ఆత్మరక్షణ కోసం అటవీ సిబ్బందికి ఆయుధాలు అందించారు. అయితే నక్సల్స్ ప్రభావం పెరిగిన తర్వాత దాడులు పెరగడంతో 80వ దశకం చివరలో ఫారెస్టు శాఖ నుంచి ఆయుధాలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది.

సీఎంఆర్ లక్ష్యం పూర్తికావాలి..

మిల్లుల్లో అదనపు కలెక్టర్ తనిఖీ



మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంరూరల్: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ లక్ష్యాన్ని ఈనెల 31లోపు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం, తదితర గ్రామాల్లో రైస్ మిల్లును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గడువులోగా బియ్యాన్ని అప్పగించకపోతే మిల్లర్లు, వారికి పూచీకత్తు ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సివిల్ సప్లయీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మిల్లర్లు తమకు ఇచ్చిన గడువులోగా బియ్యం అందజేయాలని సూచించారు.

పట్టభద్రులకు అవగాహన కల్పించండి

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం - వరంగల్ - నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల కోసం ఇప్పటికే ఓటరుగా నమోదైన వారితో సహా పట్టభద్రులంతా దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఎలక్టోరల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేలా ప్రచారం చేయాలని తెలిపారు. వచ్చేనెల 24న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు.

■ వైభవంగా మకరజ్యోతి దర్శనం



జ్యోతి వెలిగిస్తున్న పూజారి నారాయణ నంబూద్రి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీ శాస్త దేవస్థానంలో సోమవారం సాయంత్రం మకర సంక్రాంతిని పురస్కరించుకొని జ్యోతి దర్శనం ఏర్పాటుచేశారు. ఆలయ పూజారి నారాయణ నంబూద్రి ఆధ్వర్యాన ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేసిన జ్యోతిని వెలిగించారు. ఈసందర్భంగా వేలాదిగా అయ్యప్ప భక్తులు జ్యోతిని దర్శించుకున్నాక ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో స్వామి వారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని రామయ్యకు రథోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఏటా సంక్రాంతి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తిని రథంలో ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం నుంచి తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజు స్వామి వారి ఆలయం వరకు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇంటి ముందుకు వచ్చిన స్వామి వార్లకు భక్తులు నీరాజనం పలికారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం

రామయ్యకు బేడా మండపంలో మంగళవారం నిత్య కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా జరి పారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో స్వామి వారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, సంక్రాంతి సెలవుతో పాటు పాపికొండల యాత్రకు వచ్చిన వారితో రామాలయం సందడిగా మారింది.

అన్నివర్గాల సంక్షేమమే మోదీ లక్ష్యం

- గత ప్రభుత్వంలోని దళారీ వ్యవస్థను తరిమికొట్టారు..
- నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే పథకాల నిధులు
- కేంద్ర సహాయ మంత్రి బీ.ఎల్.వర్మ



నేలకొండపల్లి : బోదులబండ సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బీ.ఎల్.వర్మ

నేలకొండపల్లి: పేదలు, రైతులు, మహిళలు సహా అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, కో ఆపరేటివ్ శాఖ సహాయ మంత్రి బీ.ఎల్.వర్మ వెల్లడించారు. నేలకొండపల్లి మండలంలోని బోదులబండలో మంగళవారం ఏర్పాటుచేసిన వికసిత్ సంకల్ప్ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. దేశంలో 4 కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వగా, కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ కంటే ముందు ప్రభుత్వాల హయాంలో దళారులకే లబ్ధి జరిగేదని, కానీ మోదీ హయాంలో నేరుగా లబ్ధిదారులకే నిధులు అందుతున్నాయని చెప్పారు. అనంతరం పలువురు మహిళలకు మంత్రి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు

రఘునాథపాలెం: గ్రామీణ ప్రాంతాలు, ప్రజల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తోందని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ తెలిపారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో సోమవారం ఏర్పాటుచేసిన వికసిత్ భారత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందేలా నేరుగా పంచాయతీలకే నిధులు ఇస్తున్న ఘనత తమదేనని చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అయోధ్య రామమందిరాన్ని ఈనెల 22న ప్రారంభిస్తున్నందున అందరూ వీక్షించాలని కోరారు. అనంతరం మహిళలకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, జన్‌ధన్ ఖాతాల పాస్ పుస్తకాలు అందజేశారు. ఆతర్వాత చిమ్మపూడిలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి పరీక్షలు చేయించుకున్నారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు డాక్టర్ మాలతి, విద్యాచందన, సుమ, శ్రీలత, గణేష్, రామకృష్ణ, విల్సన్‌బెన్నీ, శ్రీనివాసరావు, హరికృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసరావు, భాస్కర్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు వజ్జా రమ్య, అనగాని అనిత, గొర్రె కృష్ణవేణి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషిచేసి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలని కేంద్ర మంత్రి బీఎల్.వర్మ సూచించారు. ఖమ్మంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నివాసంలో మంగళవారం మాట్లాడిన ఆయన సూచనలు చేయగా నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, సన్నె ఉదయ్‌ప్రతాప్, ఈ.వీ.రమేష్, దొంగల సత్యనారాయణ, లోకేశ్వర్, శ్యాం రాథోడ్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని సదాశివపురానికి చెందిన ఓ బాలిక(17) మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె పురుగుల మందు తాగింది. ఇంటికి వచ్చాక గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెకు నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మం తీసుకెళ్లారు. సదరు బాలిక ఆత్మహత్యాయత్నానికి కారణాల తెలియాల్సి ఉంది.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ



ధ్వంసం చేసిన హుండీ

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి లోప ఉన్న హుండీని ధ్వంసం చేసి నగదు దొంగిలించారు. ఘటనపై ఆలయ కమిటీ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఏడాది కాలంలో ఆలయంలో మూడు సార్లు చోరీ జరిగిందని నిందితులను గుర్తించి శిక్షించాలని వారు కోరారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఇందిరానగర్‌లోని సోనా విజన్ షోరూం మేనేజర్ ఎం.రాంబాబుపై దాడి ఘటనలలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. షోరూంను ఆదివారం రాత్రి మూసేసిన తర్వాత వాచ్‌మెన్ నాగయ్యపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారనే సమాచారంతో రాధాకృష్ణ నగర్‌లో నివాసముండే రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేసి వెళ్లాడు. ఆ తర్వాత కాసేపటికే అదే వ్యక్తులు మేనేజర్ ఇంటిపై రాళ్లు వేసి దూషిస్తూ చంపుతామని బెదిరించారు. దీంతో ఆయన డయల్ 100 కాల్ చేయడంతో పోలీసులు వచ్చేసరికి పారిపోయారు. అనంతరం మళ్లీ మేనేజర్ షోరూంకు వెళ్లగా అక్కడే ఉన్నసదరు వ్యక్తులు దాడి చేసి గాయపర్చడంతో సోమవారం ఆయన చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. కాగా, గతంలో షోరూంలో పనిచేసిన వ్యక్తితో మరొకరు దాడి చేసినట్లు గుర్తించారు.

ఘర్షణలో ఇరువర్గాలపై..

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఈనెల 14న రెండు గ్రామాలకు చెందిన యువకులు గొడవకు దిగగా పోలీసులు కేసు నమోదు చేశారు. ముదిగొండ మండలంలోని గోకినేపల్లి, నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం యువకులు నేలకొండపల్లిలో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈమేరకు పరస్పరం ఫిర్యాదు చేసుకోగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సతీష్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మం క్రైం: రోడ్డు వెంట నడిచి వెళ్తున్న మహిళ మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఖమ్మం బ్యాంకు కాలనీకి చెందిన కొణిజర్ల విజయకుమారి మంగళవారం సాయంత్రం కిరాణం వద్దకు వెళ్తోంది. ఆమె వెనక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆస్పత్రి చిరునామా అడుగుతూ విజయకుమారి మెడలోని 12.5 గ్రాముల బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

కొణిజర్ల: తెలంగాణ నుంచి ఏపీకి అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను కొణిజర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్ల పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అనుమతి లేకుండా తరలిస్తున్న 168 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. కారులో ఉన్న ఇద్దరిని ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జి.కొండూరు గ్రామానికి చెందిన తాతా రాజేష్(డ్రైవర్), బోళ్ల పవన్‌కుమార్‌గా గుర్తించారు. వీరు ఖమ్మం చుట్టుపక్కల వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా ఏపీకి తరలిస్తున్నట్లు తేలిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా రూ 1.94 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచరూరల్: అటవీ ప్రాంతంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడి చేశారు. మండలంలోని జగన్నాథపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 12 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.33,690 నగదు, 11 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బి.శ్రీనివాస్ వెల్లడించారు.

పామాయిల్ గెలలు




టన్ను ధర రూ.12,448

బిర్రులన్నీ కిటకిట..!

- సరిహద్దు ప్రాంతంలో జోరుగా కోడిపందేలు
- జిల్లా నుంచి ఏపీకి భారీగా వెళ్లిన నాయకులు, ప్రజలు





ఎన్టీఆర్ జిల్లా కాకర్లలో కోడిపందాలు జరుగుతున్న దృశ్యం



పందెం తిలకిస్తున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో డీసీసీబీ మాజీ చైర్మన్ విజయ్‌బాబు తదితరులు

సత్తుపల్లి: దింపుడు పందెం, ఎత్తుడు పందెం, ఐదెచ్చు, ఆరెచ్చు.. పందెం నీదా, నాదా అంటూ కోడి పందెం బిర్రులు హోరెత్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఏటా సంక్రాంతికి కోడి పందేల నిర్వహణ ఆనవాయితీగా వస్తోంది. ఏపీకి సరిహద్దుగా సత్తుపల్లి నియోజకవర్గం ఉండడంతో ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో పందేలు తిలకించేందుకు జిల్లావాసులు క్యూ కట్టారు. ఆంధ్రాలో కొన్నిచోట్ల ఇక్కడి నాయకలకు కోడిపందాల బిర్రులు ఉండటంతో వెళ్లేందుకు ఆసక్తి కనబర్చారు. అక్కడ భోగి, సంక్రాంతి, కనుము మూడు రోజులు ఊళ్లలో పందేల సందడి కనిపించగా.. చూసేందుకు వెళ్లేందుకు వారిలో సందడి నెలకొంది. అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు పెద్దసంఖ్యలో వాహనాల్లో పందేలు చూసేందుకు ఆంధ్రాలోని ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం కొండ్రాయిపాలెం వెళ్లారు. అలాగే, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి భర్త దయానంద్ ఆధ్వర్యాన ఎన్టీఆర్ జిల్లాలోని చీమలపాడు వెళ్లారు.

చేతులు మారిన రూ.లక్షలు..

కోడి పందాలు, లోనాబైటా(పేకాట)ల్లో రూ.లక్షలు చేతులు మారాయి. పందెం కోడి పొడిచిందనగానే.. ఒకరి ముఖంలో ఆనందం.. మరొకరి మొఖంలో నిరాశ కన్పించింది. ఇక పందెం గెలిచిన వారి హడావుడి అంతా ఇంతా కాదు. ఒక్కో పందేం కేవలం ఐదు నిమిషాల్లోనే ముగుస్తుండగా.. ఇంకో పందేనికి సుమారు అరగంట వరకు సమయం పట్టడంతో ఆసక్తితా తిలకించారు. ఈసారి పందేలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు కూడా వచ్చారని అక్కడకు వెళ్లిన వారి ద్వారా తెలిసింది.

అసలు తంతంతా పేకాటదే..

పండుగ మూడు రోజులు కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుండగా.. మరోపక్క జోరుగా పేకాట జూదం కూడా నడిచింది. రాత్రీపగలు తేడా లేకుండా ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పేకాట కొనసాగింది. పందేలు కాసేందుకు, చూసేందుకు వచ్చి వారికి కోడి పందాల బిర్రుల సమీపాన మద్యం, మాంసం, బిర్యానీ, పలావ్ వంటి ఘుమఘుమలాడే వంటకాలు సమకూర్చారు.

కోడిపందేల స్థావరాపై పోలీసుల దాడి

సత్తుపల్లిరూరల్/పెనుబల్లి: సత్తుపల్లి మండలం తాళ్లమడ శివారు కావ్వొడ్డు వద్ద నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు మంగళవారం దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా 16 ద్విచక్రవాహనాలు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు. అలాగే, పెనుబల్లి మండలం మండాలపాడు ఆయిల్‌ఫామ్ తోటలో కోడిపందేలు జరుగుతున్నాయనే సమాచారంతో ఎస్సై జి.సూరజ్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈమేరకు ముగ్గురినిఅదుపులోకి తీసుకొని రెండు కోడి పుంజులు, రెండు ద్విచక్రవాహనాలు, రూ.1,750 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా, పరారైన మరికొందరి కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండుగ పూట విషాదం..

అమ్మమ్మ ఇంటికి వచ్చి మృతి..



వారుష్‌నాయక్ (ఫైల్)

టేకులపల్లి: పండుగ పూట ఆ ఇంట విషాదం అలుముకుంది. అప్పటివరకు ఆటలాడుకున్న బాలుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఏపీలోని విజయవాడ అర్బన్ ఎన్‌టీఆర్ జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన ఇస్లావత్ మధునాయక్ రైల్వే ఉద్యోగి. కొన్నేళ్ల కిందట టేకులపల్లి మండలం బోడు పంచాయతీ లాక్యాతండాకు చెందిన బానోత్ సీతామాంగిణి కుమార్తెతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సంక్రాంతి సెలవులకు మధునాయక్ భార్యాపిల్లలతో లాక్యాతండాకు వచ్చారు. వారి పెద్దకుమారుడు ఇస్లావత్ వారుష్‌నాయక్ (7) అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బోడు వైపు నుంచి టేకులపల్లి వైపు వేగంగా దూసుకొచ్చిన ట్రాలీ బాలుడిని ఢీకొట్టింది. వెంటనే బాబును 108 ద్వారా కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని విజయవాడకు తీసుకెళ్లారు. బాలుడి తండ్రి మధునాయక్ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో రైతు మృతి

నేలకొండపల్లి: పొలంలో యూరియా చల్లేందుకు వెళ్తున్న రైతుకు గుండెనొప్పి రావటంతో బైక్ పైనుంచి పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మండలంలోని కోనాయిగూడెంకు చెందిన హుస్సేన్(50) మంగళవారం తన పొలంలో చల్లేందుకు యూరియా బస్తాలు తీసుకుని బైక్‌పై తీసుకెళ్తున్నాడు. కొద్దిదూరం వెళ్లగానే ఆయనకు గుండెనొప్పి రావడంతో రహదారిపైనే కుప్పకూలాడు. స్థానికుల గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకునిఅప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో హుస్సేన్ కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మమత ఆస్పత్రి రోడ్డు సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం శ్రీరాంనగర్‌కు చెందిన చల్లా వెంకటేశ్వర్లు(34) సోమవారం వెంకటేశ్వర్లు తన మిత్రుడు జాన్‌తో కలిసి వాటర్ క్యాన్‌లో నీరు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. రోడ్డు పక్కన నిలిపి వాహనం ఉన్న వెంకటేశ్వర్లును బోనకల్లు రోడ్డు వైపు నుండి వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో వెనక కూర్చున్న వెంకటేశ్వర్లు కింద పడగా తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఘటనపై వెంకటేశ్వర్లు భార్య ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

అదుపు తప్పి పల్టీకొట్టిన కారు



పొలంలో బోల్తా పడిన కారు

వైరారూరల్: కారు అదుపు తప్పి పల్టీ కొట్టడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి వైపు నుండి సోమవారం రాత్రి ఖమ్మం వెళ్తున్న కారు వైరా మండలం విప్పలమడక సమీపాన అదుపు తప్పి రోడ్డు పొలాల్లో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులోని నలుగురికి స్వల్ప గాయాలు కాగా ఆటోలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

కారును ఢీకొట్టిన లారీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్‌లో కారును లారీఢీ కొట్టిన ఘటనపై మంగళవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మధిరకు చెందిన ఉపాధ్యాయుడు యరమల కోటారెడ్డి సోమవారం తన కారులో వచ్చి తిరిగి బయలుదేరాడు. ఈక్రమంలో శ్రీశ్రీ సర్కిల్ వద్ద వెనక నుండి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఘటనపై కోటారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారికి సంక్రాంతి, కనుమ పండగల సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని పసు పు, కుంకుమ, చీరలు, గాజులు, ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న క్లీనర్ మృతి

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లారీ క్లీనర్ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలానికి చెందిన లారీ యజమాని అంపోలు రాంబాబు.. అదే గ్రామానికి చెందిన ఆళ్ల సాయిని క్లీనర్‌గా పెట్టుకున్నాడు. ఈ నెల 12న రాత్రి వీరిద్దరూ కిరాయి నిమిత్తం అశ్వారావుపేట నుంచి గుండాలకు వెళ్తున్నారు. మండలంలోని అచ్యుతాపురం క్రాస్ రోడ్డు సమీపంలో డ్రైవర్, యజమాని రాంబాబు అతివేగం, నిర్లక్ష్యంతో లారీని నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో క్లీనర్ ఆళ్ల సాయి తీవ్రంగా గాయపడగా ఖమ్మం తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరి కొర్సా రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వేంసూరు: మద్యం తాగొద్దని కుటుంబీకులు మందలించడంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మర్లపాడుకు చెందిన దైదా కుటుంబరావు (54) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈమేరకు భార్యతో గొడవపడిన ఆయన శని వారం ఇంట్లో ఎవరూలేని ఉరి వేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన భార్యతో పాటు నలుగురు సంతానం ఉండగా.. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



గాయపడిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అబ్బుగూడెం శివారులో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వారు గాయపడ్డారు. అదే సమయాన అన్నపురెడ్డిపల్లి నుంచి కొత్తగూడెం వెపు వెళ్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేసి ఆస్పత్రికి పంపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, బోజ్జా నాయక్, శివప్రసాద్, ఏడుకొండలు, నాగరాజు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన లారీడ్రైవర్లు

ఖమ్మంగాంధీచౌక్: కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'హిట్ అండ్ రన్' చట్టాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని లారీ డ్రైవరు, క్లీనర్లు బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. ఈమేరకు సమ్మె అంశంపై ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ బాధ్యులకు లేఖ అందజేశారు. సంక్రాంతి సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఆరు రోజుల సెలవులు ఇవ్వగా బుధవారం తిరిగి ప్రారంభం కానుంది. మార్కెట్‌కు రైతులు విక్రయానికి తీసుకొచ్చే పంట ఉత్పత్తులను కొనుగోలు చేశాక లారీల్లో వ్యాపారులు తరలిస్తారు. అయితే, రైతులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉండడం, ఇదే రోజు లారీడ్రైవర్లు సమ్మె మొదలుపెడితే రవాణాకు ఆటంకం కలిగే అవకాశముందని భావిస్తున్నారు.

కేసులు నమోదు

ఇల్లెందు: పెళ్లయిన కొన్నేళ్లకే భర్త, అత్తామామల వేధింపులు తాళలేక ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కరుణాకర్ విచారించి కేసు నమోదు చేశారు. మండలంలోని పూసపల్లికి చెందిన జోగా నిరోషకు ఉసిరికాయలపల్లికి చెందిన కిరణ్‌తో 2017లో వివాహం జరిగింది. సింగరేణి శ్రీరాంపూర్‌లో ఉద్యోగం చేస్తున్న కిరణ్ కొంతకాలంగా భార్యను వేధిస్తున్నాడు. కిరణ్, అతడి తల్లిదండ్రులు కూడా మద్దతు పలకడంతో వేధింపులు తీవ్రరూపం దాల్చాయి. విచారించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడికి యత్నం..

ఇల్లెందు: మండలంలోని మసివాగుతండాకు చెందిన బానోతు ఈరూ ఇంటి పక్కన జీవిస్తున్న ధరావత్ వినయ్ రాత్రి మద్యం మత్తులో ఇంటి మీద రాళ్లు రువ్వుతున్నాడు. గుర్తించి ప్రశ్నించిన ఈరు మీద దాడికి ప్రయత్నించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ చందర్ విచారించి కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి..

ఇల్లెందు: పట్టణంలోని నంబర్–2 బస్తీకి చెందిన కందుల సూర్యతేజ కొత్త బస్టాండ్ సెంటర్‌లోని ఉషా హోటల్ పక్కన గల ఖాళీ స్థలంలో కాలకృత్యం తీర్చుకునేందుకు వెళ్లగా ఆ హోటల్ యజమాని సంతోష్‌కుమార్ కర్రతో దాడి చేశాడు. సూర్యతేజ గాయపడటంతో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవూఫ్ కేసు నమోదు చేశారు.

మోసం చేసిన యువకుడిపై..

పాల్వంచరూరల్: ప్రేమించి మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలానికి చెందిన యువతిని చర్ల మండలం కలివేరు ఒడ్డుగూ డెం గ్రామానికి చెందిన యాసం రవీందర్ గతేడాది నుంచి ప్రేమిస్తున్నానని వెంటపడి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని, డబ్బులు ఇచ్చి వదిలించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాడని బాధితురాలు రూరల్ పోలీసులను గత గురువారం ఆశ్రయించింది. కాగా, మంగళవారం రవీందర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదా కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. చిన్నారి రుంజా యాస్మిక చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకోగా ఆలయ మేనేజర్ రమణ బాలికను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, చంద్రుగొండ ఎంపీడీఓ రేవతి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునుడికి నంది వాహన సేవ..

మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మంగళవారం నందివాహన సేవను వైభవంగా జరిపించారు. స్వామివారికి అర్చన, అభిషేకం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శివాలయ వ్యవస్థాపక నిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- అందుకోసం ప్రధాని మోదీ విశేష కృషి
- ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ

కొత్తగూడెంరూరల్: ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ విశేష కృషి చేస్తున్నారని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి బీ.ఎల్. వర్మ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురంలో మంగళవారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశాన్ని నేడు ఐదో స్థానానికి తీసుకొచ్చారని, 2047 నాటికి ప్రథమ స్థానంలోకి తెస్తారని చెప్పారు. దేశంలోని పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. గత ఐదేళ్లలో 13.50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి విముక్తి పొందారని చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు అనేక చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఏడేళ్లలో 49.50 కోట్ల మంది రైతులు సభ్యులుగా నమోదయ్యారని, 14.9 కోట్ల మంది రైతులకు రూ.1.45 లక్షల పంటల బీమా అందిందని వివరించారు. ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన పథకం కింద బిందుసేద్యం లక్ష్యాన్ని గణనీయంగా పెంచామని చెప్పారు. వికసిత భారత్ సంకల్ప యాత్రను ప్రతిరోజూ ఏడు వాహనాల ద్వారా గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు వివరించారు. ఈనెల 25 వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఇద్దరు మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఎల్‌బీఎం రామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ శిరీష, వ్యవసాయ అధికారి అభిమన్యుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాత్రలో చురుగ్గా పాల్గొనండి..

సుజాతనగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యాత్రలో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ కోరారు. సోమవారం ఆయన సర్వారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పలు పథకాల గురించి వివరించారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో పూజలు



రామాలయంలో కేంద్ర మంత్రి వర్మ, నాయకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అంతరాలయంలో మూలమూర్తులు, ఉపాలయాల్లో పూజల అనంతరం వేదాశీర్వచనం, స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచల రామయ్యను దర్శించుకున్నట్లు తెలిపారు.

ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

- పెళ్లయిన పదేళ్ల అనంతరం సంతానం
- ఆరోగ్యంగా తల్లీపిల్లలు



ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు పిల్లలు

సింగరేణి(కొత్తగూడెం): పెళ్లయిన పదేళ్ల అనంతరం దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. తల్లీపిల్లలు ఆరోగ్యంగా ఉండటంతో ఇక ఆ ఇంట ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఈ ఘటన కొత్తగూడెంలోని మాతా, శిశు ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ వీరబాబు కథనం ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన గుండారపు శ్రీను, కల్యాణికి సుమారు పదేళ్ల కిందట వివాహమైంది. ఈ క్రమంలో తొలిసారి కల్యాణి గర్భం దాల్చగా.. మెరుగైన వసతులు ఉన్నట్లు తెలుసుకున్న శ్రీను కల్యాణిని కొత్తగూడెంలోని మాతా, శిశు ఆస్పత్రిలో ప్రసవం కోసం ఈ నెల 16న చేర్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బోడ కుమారస్వామి ఆదేశాల మేరకు ఆర్ఎంఓ పర్యవేక్షణలో ఆపరేషన్ చేయగా ముగ్గురు పిల్లలు (ఇద్దరు బాబులు, ఒక పాప) జన్మించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే కల్యాణికి ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని వైద్యులు తెలిపారు. తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నారని వారు వివరించారు. ఆపరేషన్ ప్రక్రియలో మత్తు వైద్యులు రాము, శైలేష్, గైనకాలజిస్టులు సాత్విక, శ్రుతి, సింధు, పిల్లల వైద్యులు ప్రియాంక, వీరబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జేఈఈ అభ్యర్థులకు రూట్‌మ్యాప్

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపింది. ఈ నెల 24న పేపర్‌-1 (ఆర్కిటెక్చర్) జరుగుతుంది. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు ఇప్పటికే పరీక్ష కేంద్రం వివరాలను https://jeemain.nta. nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. అయితే అడ్మిట్ కార్డులను మాత్రం ఇంకా విడుదల చేయలేదు. ఈ నెల 27న జేఈఈ మెయిన్స్ పేపర్‌-2 జరుగుతుంది. ఈ పరీక్ష రాసే వారి కేంద్రాల వివరాలను త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది. మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకూ జరుగుతాయి.

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం

తిరుమల: పవిత్రమైన ధనుర్మాసం ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. గతేడాది డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ ధనుర్మాస ఘడియలు కావడంతో శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. కాగా, శ్రీవారికి మహా భక్తురాలైన శ్రీగోదాదేవి పరిణయోత్సవాన్ని పురస్కరించుకుని గోదామాలలు శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం అలంకరించారు.

అజ్మీర్ షరీఫ్ రైలు ప్రారంభం

నాంపల్లి (హైదరాబాద్): అజ్మీర్ షరీఫ్‌-హైదరాబాద్ ప్రత్యేక రైలును సోమవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అజ్మీర్‌కు వెళ్తున్న యాత్రికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బయలుదేరిన ఈ రైలు.. ఈ నెల 17వ తేదీన ఉదయం 8.30 గంటలకు రాజస్తాన్‌లోని అజ్మీర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.

ఇద్దరు రాష్ట్ర అధికారులకు ఐఏఎస్ హోదా

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించింది. రాష్ట్ర ఆదాయ పన్నుల శాఖలో పనిచేస్తున్న కె.సీతాలక్ష్మీ, జి.ఫణీంద్రారెడ్డికి ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

పోలీస్ స్పందన 7 నిమిషాల్లో..

'100 యాప్'తో పెట్రోలింగ్ పర్యవేక్షణ

- 2023లో సరాసరి లెక్కించిన పోలీసులు
- ఈ ఏడాది ఇంకా తగ్గించేలా ప్రణాళిక
- గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగుపడే దిశగా అడుగులు



సాక్షి, హైదరాబాద్: ఏదైనా సంఘటన చోటుచేసుకున్న వెంటనే బాధితులు లేదా అక్కడ ఉన్న వారు వెంటనే డయల్ 100కు కాల్ చేస్తారు. ఆ కాల్ రిసీవ్ చేసుకున్నాక ఎంత తక్కువ సమయంలో పోలీసులు ఆ స్థలానికి చేరుకుంటే అంత మెరుగైన ఫలితాలు వస్తాయి. దీనినే సాంకేతికంగా 'పోలీస్ రెస్పాన్స్ టైమ్'అంటారు. గస్తీ విధానంలో జవాబుదారీతనం పెంచడం, నేరాలు చోటు చేసుకునే ప్రాంతాల్లోనే పెట్రోలింగ్ జరిగేలా చూడటం తదితర లక్ష్యాలతో ఓ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా 2023కు సంబంధించి రెస్పాన్స్ టైమ్‌ను లెక్కించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరిన ఈ సమయం ఏడు నిమిషాలుగా ఉండగా, ఈ ఏడాది మరింత తగ్గించాలనేది పోలీసులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

ఒకప్పుడు ఇలా...

ఎవరైనా '100'కు కాల్ చేస్తే, అది నేరుగా 'డయల్‌-100'కమాండ్ సెంటర్‌కు చేరుతుంది. వెంటనే వారు బాధితుడు ఏ ఠాణా పరిధిలోకి వస్తాడో వాకబు చేస్తారు. ఆ తర్వాత సదరు ఫోన్ కాల్‌లోని అంశాలను సంక్షిప్త సందేశంగా (టెక్స్ట్) మార్చి బాధితుడున్న ఏరియాలోకి వచ్చే ఠాణాతో పాటు జోన్ కార్యాలయం, కమిషనరేట్‌కు చెందిన ప్రధాన కంట్రోల్ రూమ్‌లోని కంప్యూటర్లకు పంపించేవారు. దీంతో పాటు వాకీటాకీ ద్వారానూ సమాచారం ఇచ్చి గస్తీ వాహనాలను అప్రమత్తం చేసేవారు. ఈ సమాచారం అందుకునే గస్తీ వాహనం ఎక్కడ ఉంది? బాధితుడికి ఎంత దూరంలో ఉంది? తదితర అంశాలు తెలుసుకునే అవకాశం ఉండేదికాదు. ఫలితంగా గస్తీ వాహనం బాధితుడి వద్దకు చేరే సమయం చాలా ఎక్కువగా ఉండేది. ఘటనాస్థలికి చేరిన తర్వాత పెట్రోలింగ్ సిబ్బంది చెప్పే అంశాల ఆధారంగా ఫిర్యాదుగా పరిగణించే ఫోన్ కాల్‌ను క్లోజ్ చేసేవారు.

ఇప్పుడు...ట్యాబ్‌నే 'జీపీఎస్'

బాధితుడు '100'కు ఫోన్ చేసి సహాయం కోరిన వెంటనే అక్కడి సిబ్బంది సదరు ఫిర్యాదుదారుడు ఉన్న ప్రాంతాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. సిటీలోని ప్రతి గస్తీ వాహనం, బ్లూకోల్ట్స్‌లకు పోలీసు విభాగం ట్యాబ్స్ అందించింది. ఇవే జీపీఎస్ పరికరంగా పనిచేస్తుండటంతో దాని ఆధారంగా 'డయల్‌-100'సిబ్బందికి ఏ వాహనం ఏ ప్రాంతంలో ఉందో కంప్యూటర్ తెర/ట్యాబ్/ప్రత్యేక యాప్ ద్వారా కచ్చితంగా తెలుస్తుంది. దీంతో బాధితుడు ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న వాహనానికే నేరుగా ఆ ఫోన్ కాల్ డైవర్ట్ చేస్తున్నారు. ఈ తతంగం మొత్తం కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. పెట్రోలింగ్ వాహనాల్లో ఉండే సిబ్బంది ఫోన్లకు '100'నుంచి డైవర్ట్ అయిన కాల్ వస్తే.. ప్రత్యేక రింగ్‌టోన్ ద్వారా ట్యాబ్‌లో రింగ్ వస్తుంది. ఫోన్ ఎక్కడ నుంచి అనేది తేలిగ్గా తెలియడానికి అన్ని వాహనాల్లోని సిబ్బందికీ ఇలాంటి రింగ్‌టోన్ ఏర్పాటు చేశారు. ఆ సిబ్బంది ఫోన్ ఎత్తిన వెంటనే ఆ ట్యాబ్‌లో తెరపై ఓ నోటిఫికేషన్ ప్రత్యక్షమవుతుంది. అందులో బాధితుడు/ఫిర్యాదుదారుడికి సంబంధించిన అంశాలు, ఫిర్యాదు ఏమిటన్నవి కనిపిస్తాయి. వీటిని చూసిన వెంటనే గస్తీ వాహనంలోని సిబ్బంది 'రిసీవ్'అనే బటన్ నొక్కడం ద్వారా ఫిర్యాదు అందుకున్నట్టు ధ్రువీకరిస్తున్నారు.

అలా...గణన షురూ..

పెట్రోలింగ్ వాహనం, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఒకసారి ఫిర్యాదు అందుకున్నట్టు ట్యాబ్‌లో ఉండే '100 యాప్'ద్వారా ధ్రువీకరించిన వెంటనే 'రెస్పాన్స్ టైమ్'లెక్కింపు ప్రారంభమవుతోంది. ఘటనాస్థలికి చేరుకునే గస్తీ వాహనాలు ఫిర్యాదు తీరును బట్టి అవసరమైన రీతిలో స్పందించే విధంగా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, ఆధారాల కోసం ఫొటోలు తీసుకుంటున్నారు. పబ్లిక్ ప్లేస్‌లో జరిగే గొడవలు, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదు అయితే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తారు. దీంతో ఘటనాస్థలాల్ని వీడియోలో చిత్రీకరించి భద్రపరుస్తున్నారు. సహాయక చర్యలు, తదుపరి యాక్షన్స్ తీసుకోవడం పూర్తయిన వెంటనే సదరు ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్ ద్వారానే సంబంధిత స్టేషన్ హౌస్‌ఆఫీసర్‌కు పంపిస్తున్నారు.

'క్లోజ్'చేసే వరకు 'టైమ్ రన్నింగ్'...

గస్తీ బృందాలు ఘటనాస్థలికి చేరుకోవడం వంటి చర్యలు పూర్తయిన తర్వాత మొదట వచ్చిన నోటిఫికేషన్ మళ్లీ ఓపెన్ చేయాలి. అందులో ఉండే 'కాల్ క్లోజ్'బటన్ నొక్కడంతో ఈ వ్యవహారం పూర్తవుతుంది. అప్పటి వరకు సమయం లెక్కింపు జరుగుతూ ఉంటుంది. ఈ సమయాన్నే 'పోలీసు రెస్పాన్స్ టైమ్'గా పరిగణిస్తున్నారు. ఫోన్‌కాల్ వచ్చిన దగ్గర నుంచి జరిగే ప్రతిదీ 'డయల్‌-100'తో పాటు కమిషనరేట్ కంట్రోల్ రూమ్, జోనల్ కార్యాలయాలకు చేరుతూ పర్యవేక్షణకు దోహదం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రెస్పాన్స్ టైమ్ పట్టణాల్లో తక్కువగా, గ్రామాల్లో ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లోనూ తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ఫైళ్ల మాయం, అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు

- పశుసంవర్ధకశాఖలో అక్రమాలపై ముమ్మర విచారణ
- ఏసీబీకి కేసుల బదిలీ

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధకశాఖలో ఫైళ్ల మాయం, గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై అవినీతి నిరోధకశాఖ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ రెండు కేసులను ప్రభుత్వం ఏసీబీకి బదిలీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఫైళ్లను మాయం చేసేందుకు ప్రయత్నించడంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులలో భారీ అవినీతికి ఆస్కారం ఉన్నందున లోతైన దర్యాప్తు బాధ్యతను ఏసీబీకి ప్రభుత్వం అప్పగించింది. గొర్రెల కొనుగోలు యూనిట్లకు నగదు చెల్లింపుల్లో.. అవినీతి, పశుసంవర్ధకశాఖ ఫైళ్లను మాయం చేసేందుకు జరిగిన కుట్రలో దాగిన మరిన్ని నిజాలను వెలుగులోకి తెచ్చేందుకు ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలిసింది. ఈ రెండు కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏసీబీ రంగంలోకి దింపినట్టు సమాచారం.

తిరుగు ప్రయాణాలతో హైవే రద్దీ

సంక్రాంతికి పల్లెలకు వెళ్లినవారు పట్నంబాట


గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్/బీబీనగర్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లి న తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ ప్రారంభమైంది. హైదరాబాద్ మార్గంలో కార్లు, ఇతర సొంత వాహనాలు పెద్దసంఖ్యలో బారులుదీరాయి. ఈ రద్దీ సాయంత్రం తర్వాత పెరిగే అవకాశాలు ఉన్నా యని భావించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పెట్రోలింగ్ టీంలను అందుబాటులో ఉంచారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీ సీ బస్‌స్టేషన్, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌర స్తా వద్ద ఉన్న జంక్షన్లను తాత్కాలికంగా మూసివేశారు. ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. దీంతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము కిలోమీటర్ల దూరం వెళ్లి యూటర్న్ తీసుకోవడం ఇబ్బందిగా ఉందని, ఇక్కడి నుంచే పంపించాలని పట్టుబట్టారు.దీంతో సుమారు అరగంటసేపు అయోమయపరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఇదే సమయంలో వాహనదారులు సర్వీస్ రోడ్లలోకి వెళ్లారు. దీంతో ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్లు వాహనాలతో రద్దీగా మారాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కొద్దిసేపు స్తంభించాయి. కాగా,యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా నుంచి పగిడిపల్లి వరకు వాహనాలు సాయంత్రం నుంచి రాత్రి 9గంటల దాకా బారులుదీరాయి.

మైనారిటీ గురుకులాల్లో.. రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ఆయేషా మసరత్ ఖానమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ పరిధిలోని 204 పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలు, 10 సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ)ల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఇన్‌స్టాల్ చేసుకోవాలి. మైనార్టీ విద్యార్థులతో పాటు నాన్ మైనార్టీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు సొసైటీ వెబ్‌సైట్‌లో లేదా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లేదా మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ కోసం సొసైటీ కార్యాలయంలో ప్రత్యేకంగా 040-23437909 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు.

రాజధానిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఫోకస్

జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌పై సీనియర్ పోలీస్ అధికారులతో డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రవిగుప్తా సీనియర్ పోలీసు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, మెరుగుపరచడానికి సమర్థవంతమైన చర్యలపై పోలీస్ అధికారులు సూచనలు ఇవ్వాలని డీజీపీ కోరారు. విజిబుల్ పోలీసింగ్ అమలు, ట్రాఫిక్ సిబ్బందికి ఆధునిక శిక్షణ అందించడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త స్కైవాక్‌లు, ఫ్లైఓవర్‌ల చుట్టూ ట్రాఫిక్ పరిస్థితులను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను డీజీపీకి వివరించారు. మూసీనది ప్రాంతంలో వంతెనల పరిస్థితి, ప్రతిపాదిత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు, శిక్షణాకేంద్రం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ఐజీ తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

వాలీబాల్ పోటీల విజేత 'కొల్లాపురం'


తుదిపోరులో తలపడుతున్న క్రీడాకారులు

ఇల్లెందురూరల్: మండలంలోని కొల్లాపురం గ్రామంలో నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీల్లో కొల్లాపురం జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం బొజ్జాయిగూడెం సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. పోటీల్లో మామిడిగుండాల, జగదాంబగుంపు జట్లు ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచాయి. కార్యక్రమంలో చీమల రామ్మూర్తి, బొర్రా భద్రం, మండల వెంకన్న, పెద్దబోయిన హేమలత, కుంజా రాంచందర్, బుగ్గ వెంకటేశ్వర్లు, రావూరి ఉపేందర్, ఆదినారాయణ, కోడి శ్రీను, మోకాళ్ల రమేశ్, జె.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూరు టోర్నీకి వెళ్లిన ఐటీడీఏ క్రీడాకారులు


క్రీడాకారుల బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: వారం పాటు శిక్షణ అనంతరం భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని క్రీడాకారులు ఉట్నూరులో జరగనున్న సొసైటీ క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు బయలుదేరారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని క్రీడాపాఠశాల మైదానంలో ఈ నెల 7 నుంచి 16 వరకు 130 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఉట్నూరులో బుధవారం మొదలయ్యే క్రీడోత్సవాల్లో పాల్గొనేందుకు వీరు మూడు బస్సుల్లో వెళ్లారు. ఏటీడీఓ పి.నర్సింహారావు, క్రీడల అధికారి బి.గోపాల్‌రావు, హెచ్‌ఎం చందు, అధికారులు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, బాలసుబ్రహ్మణ్యం, రామారావు, మోతీలాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరిగేనా?

- సింగరేణిపై దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం
- వేతనాల్లో వ్యత్యాసాలపై ఆరా తీసిన డిప్యూటీ సీఎం భట్టి
- ఇకనైనా జీఓ 22 వర్తింపజేయాలని కార్మికుల విన్నపం


సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో తాజాగా సింగరేణి సీఎండీ బలరామ్, అధికారులు సమావేశమైన సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. సింగరేణిలో 39 వేల మంది పర్మనెంట్ కార్మికులతో పాటు 28 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాల్లో తేడా ఉండటంపై భట్టి అధికారులను ప్రశ్నించారు. కోలిండియా పరిధిలోని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించే వేతనాలకు సంబంధించి జీఓలు, ఇతర పరిశ్రమల్లోని వేతనాలను పరిశీలించి ఏది ఎక్కువగా ఉంటే అలాగే చెల్లించాలని ఆదేశించినట్లు తెలిసింది. అదేవిధంగా ఎన్నికలకు ముందు భట్టి కోల్‌బెల్ట్ ప్రాంతంలో చేసిన పాదయాత్ర సందర్భంగా గుర్తించిన సమస్యలు, పలు అంశాలపై సింగరేణి అధికారులతో చర్చించిన నేపథ్యాన తమ సమస్యలు పరిష్కారమవుతాయని కాంట్రాక్ట్ కార్మికులు ఆశిస్తున్నారు.


56 విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణిలో కాంట్రాక్ట్ పనులు తొలుత రెండు, మూడు విభాగాల్లో 102 మందితో 1998లో ప్రారంభమయ్యాయి. కానీ, ఇప్పుడు సుమారు 56 విభాగాల్లో దాదాపు 28 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. సివిల్, సివిక్, రైల్వేసైడింగ్, బెల్ట్ క్లీనింగ్, సెక్యూరిటీ గార్డులు, ఫిల్టర్ బెడ్లు, పార్కుల నిర్వహణ, కోల్ ట్రాన్స్‌పోర్టర్లు తదితర పనుల్లో ఎక్కువగా కాంట్రాక్ట్ కార్మికులే ఉన్నారు.

జీఓ ఉన్నా అమలేది?


సింగరేణి సంస్థ కాంట్రాక్ట్ కార్మికుల్లో హైస్కిల్డ్ వారికి రోజుకు రూ.839, స్కిల్డ్ కార్మికులకు రూ.709, సెమీస్కిల్డ్ వారికి రూ.589, సాధారణ కార్మికులకు రూ.504 చెల్లిస్తోంది. అయితే, కొన్ని ఏరియాల్లో స్కిల్డ్ పనిచేసినా కూడా సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కాగా, గతంలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల చెల్లింపునకు జీఓ 22 విడుదలైంది. దీని ఆధారంగా అన్‌స్కిల్డ్ వారికి రూ.751, సెమీ స్కిల్డ్ వారికి రూ.870, స్కిల్డ్ కార్మికులకు రూ.1,100 చెల్లించాలి. ఈ మేరకు కొత్త ప్రభుత్వమైనా ఈ జీఓ వర్తింపజేయాలని కార్మికులు కోరుతున్నారు.

జీఓ 22 అమలైతేనే మేలు..



సింగరేణిలో కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదని చెప్పిన గత ప్రభుత్వం మోసం చేసింది. కాంటాక్ట్ కార్మికుల వేతనాలు కూడా పెంచలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియా మాదిరి వేతనాలు ఇవ్వాలి. జీఓ 22 అమలు చేస్తేనే కష్టాలు తీరతాయి.
–యాకూబ్ షావలీ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..



సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో ప్రభుత్వ జీఓ, ఆదేశాలు.. కంపెనీ డైరెక్టర్ల సూచనల మేరకు నిర్ణయాలు జరుగుతాయి. ఒకవేళ వేజ్‌బోర్డ్ సంఘాలు కేంద్ర కార్మిక శాఖల నుంచి జీఓలు ఇప్పిస్తే అమలు చేసేందుకు మేం సిద్ధంగా ఉంటాం.
–బి.హన్మంతరావు, జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)

అమెరికాలో ఘనంగా 'ఆట' బాలోత్సవం


నృత్యం చేస్తున్న యువతి


విజేతలకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న బెక్కంటి శ్రీనివాస్ తదితరులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, అవార్డ్ టీచర్స్ అసోసియేషన్ (ఆట) ఇండియా ఆధ్వర్యాన అమెరికాలోని ఫామింగ్ టన్ నగరంలోని శివాలయం ఆవరణలో సోమవారం బాలోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరుకాగా, దేవాలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సుబ్బి మాట్లాడుతూ.. తమ దేవాలయంలో బాలోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించాలని ఆటా యూఎస్‌ఏ కోఆర్డినేటర్ సౌజన్యకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆటా వ్యవస్థాపక అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావుతో పాటు వెంకట్, సీతారాం, ఉషారాణి మాట్లాడుతూ.. బాలోత్సవం అమెరికాలో నిర్వహించడంతో భారత్‌కు చెందిన ఉపాధ్యాయుల కీర్తి ప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయికి వ్యాప్తి చెందాయని తెలిపారు.

దంతెవాడ జిల్లాలో ఎదురుకాల్పులు

మావోయిస్టు ఏరియా కమిటీ కార్యదర్శి మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి మృతి చెందగా పలువురు మావోయిస్టులు తప్పించుకున్నారు. ఏఎస్పీ ఆర్కే బర్మన్ తెలిపిన వివరాల ప్రకారం.. బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధి మంగనార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపడంతో పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. హోరాహోరీ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందగా పలువురు తప్పించుకెళ్లారు. మృతుడిని రూ.5 లక్షల రివార్డు కలిగిన మావోయిస్టు ఏరియా కమిటీ కార్యదర్శి రతన్‌గా గుర్తించగా, ఘటనాస్థలి నుంచి మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోలీస్ క్యాంపులపై మావోయిస్టుల కాల్పులు

- రెండు క్యాంపులతో పాటు పోలీస్ స్టేషన్‌పై దాడి
- దీటుగా తిప్పికొట్టిన బలగాలు

చర్ల: తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ మంగళవారం రాత్రి కాల్పుల మోతతో దద్దరిల్లింది. పోలీసు బలగాల క్యాంపులపై మావోయిస్టులు కాల్పులతో విరుచుకుపడ్డారు. ఈ ఘటనతో అటు ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఇటు తెలంగాణలోనూ పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజీపూర్ జిల్లా పామేడు సమీపంలోని చింతవాగు ఒడ్డున రెండేళ్ల కిందట సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపును ఏర్పాటు చేశారు. దీనికి సమీపాన ధర్మారంలోనూ ఇటీవల మరో క్యాంపు ఏర్పాటైంది. అయితే చింతవాగు ఒడ్డున ఉన్న క్యాంపుపై గతంలో పలుమార్లు కాల్పులకు యత్నించిన మావోయిస్టులను పోలీసు బలగాలు తిప్పికొట్టాయి. తాజాగా మంగళవారం రాత్రి సుమారు 7 గంటల సమయాన అకస్మాత్తుగా ధర్మారం, చింతవాగు సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపులతో పాటు పామేడులోని పోలీస్‌స్టేషన్లపైకి ఏకకాలంలో మావోయిస్టులు కాల్పులకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసు బలగాలు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు గంటన్నరపాటు మూడు క్యాంపుల వద్ద హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల కంటే ముందు మావోయిస్టులు క్యాంపులపైకి లైటింగ్ బాంబులు విసినట్లుగా తెలిసింది. ఈ ఘటనతో పామేడు సమీపంలో ఉన్న తోగ్గూడెం, తిప్పాపురం, చెన్నాపురం క్యాంపుల్లోని బలగాలను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఆనాదిగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని టీఎస్‌ఏటీఎఫ్ నేతలు టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన్ను కలిసిన టీఎస్‌ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి పలు అంశాలపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గిరిజన ఉపాధ్యాయుల పదోన్నతులు, 317 జీఓ, ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాక పోడు భూముల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌ఏటీఎఫ్ నేతలు పాయం ఆనందరావు, ఊకె కృష్ణ తదితరులు ఉన్నారు.

కిన్నెరసానికి పోటెత్తిన పర్యాటకులు





డీర్ పార్కులోకి వెళ్లేందుకు వేచి ఉన్న జనం (ఇన్‌సెట్) బోటుషికారు చేసేందుకు సిద్ధమవుతున్న పర్యాటకులు

రెండు రోజుల్లో రూ.1,66,025 ఆదాయం

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన పాల్వంచ మండలంలోని కిన్నెరసానికి పర్యాటకులు బారులు దీరారు. సంక్రాంతి సెలవులు కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే కాక పొరుగు జిల్లాల నుంచి కూడా పిల్లాపాపలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించడమే కాక బోట్ షికారు చేశారు. సోమవారం పర్యాటకుల టికెట్ల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.61,575, మంళవారం రూ.42,850 ఆదాయం, బోట్ షికారు ద్వారా సోమ, మంగళవారాల్లో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.61,600 ఆదాయం నమోదైంది. మొత్తంగా రెండు రోజుల్లో వైల్డ్‌లైఫ్ శాఖ, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.1,66,025 ఆదాయం లభించింది.